రచన - జనవరి 2002

# క్రీనీడ క్రీడలు

వయసుతో వచ్చే కోరికలు, వయసుతో కొనసాగే కోరికలు జీవితంలో అంతర్వాహిని లాంటివి. అవి ఎప్పుడు, ఎక్కడ, ఎలా విజృంభిస్తాయో చెప్పడం కష్టం. శారీరకమైన ఈ కోరికలకి జాతి, మత, కుల, వర్గ విభేదాలుండవు. వయసు ఈ కోరికల్ని రెచ్చగొడ్తుంది. మనసు సంఘపరంగా, నైతికపరంగా వాటిని అదుపులో ఉంచడానికి ప్రయత్నిస్తుంది. మనసు శృంఖలాల్ని అవి విడిపించుకొని బయటపడ్డాయా, దేహాన్ని దావానంలా దహిస్తాయి. గండిపడ్డ చెరువు ఊరిని ముంచెత్తినట్టుగా శరీరాన్ని ముంచేస్తాయి. దేశాధ్యక్షుల నుంచి మహారాణుల వరకూ, ప్రముఖుల నుంచి అతిసామాన్యుల వరకూ ఈ కోరికలకి బానిసలే! వివాహేతరమైన విషయాలు బహిర్గతమైనప్పుడు అయావ్యక్తులు వారి వారి అంతస్తుని బట్టి, హోదాలని బట్టి నలుగురి నోళ్ళలోనూ నానడమో, వార్తాపత్రికల కెక్కడమో జరుగుతుంది.

జీవన భాగస్వామి నిరాసక్తత చూపించినా, లేదా జీవన భాగస్వామిని కాలసర్పం కాటేసినా, వయసులో వున్న స్త్రీ పురుషులకి వయసు కోరికలు తీవ్ర సంక్షోభాన్ని కలిగిస్తాయి. అప్పుడు జరిగే పరిణామాలు ఆయా వ్యక్తుల స్వభావం మీదా, సమాజం ప్రభావం మీదా ఆధారపడి ఉంటాయి.

ఆ ఊరికో చెరువుంది. చెరువు గట్టు మీద రావిచెట్టు. రావిచెట్టు చుట్టూ సిమెంటు తిన్నె. ఆ రచ్చబండా, రావిచెట్టూ ఆ ఊరి వారి కథలన్నీ శ్రద్ధగా ఆలకించి జీర్ణం చేసుకొంటాయి.

పతి పరమదించిన పదిహేనో రోజుకే రాములమ్మకీ, పక్కింటి సుందర్రావుకీ లింకు కుదిరిపోయిందని బాతాఖానీ రాయుళ్ళు తెగ తర్జనభర్జనలు చేసుకొన్నారు. అమ్మలక్కలు చెరువు నీటిలో బిందెలు ముంచుతూ ఆడిపోసుకున్నారు. పెళ్ళాన్ని పక్కల్లోకి లాక్కొంటూ రాములమ్మని ఊహించుకొనే పతిదేవుళ్ళూ, సుందర్రావు అదృష్టానికి అసూయపడ్డ యువకులూ ఆ గ్రామంలో చాలామందే వున్నారంటే, రాములమ్మ ఎంత అందంగా, ఆకర్షణీయంగా ఉంటుందో ఊహించడం కష్టం కాదు.

సుందర్రావుది పేరుకి తగ్గ అందం కాకపోయినా మనిషి నీటుగా, డాబుగా ఉంటాడు. రెడీమేడ్ దుస్తులు అతగాడికి అతికినట్లు సరిపోతాయంటే, అతని శరీర నిర్మాణం ఎంత పొందికగా

ఉంటుందో ఊహించుకోవచ్చు. ఏదో కాస్త భూమి, ఓ డాబా ఇల్లూ ఉన్నాయి. రైతులకీ, మిల్లు యాజమానులకీ మధ్య దళారీగిరి అతని వ్యాపకం. రాతకోతలకీ, మిల్లు యాజమానుల కోసం పర్మిట్లకనీ, పర్మిషన్లకనీ చేసే ప్రయాణాల కోసం సుందర్రావంటే ఎంతో గిరాకీ ఉంది. మొదటి కాన్పులో భార్యా శిశువు లిద్దరూ మరణించడంతో, గత పదేళ్ళ నుంచీ ఒంటరిగానే ఉంటున్నా, ఒంటరి జీవితాన్ని మట్టుకు గడపలేదు. ఇంటిపని చేసే మనిషి అతని అన్ని అవసరాలు తీరుస్తున్నదన్న ఇది ఆ గ్రామ ప్రజలలో లేకపోలేదు.

అయినింటి అత్తలూ, కోడళ్ళూ - తల్లులూ, కూతుళ్ళూ చిల్లులు పడేటట్లు బుగ్గలు పొడుచుకొన్నా, సమాజపరమైన నిందాపూరిత వాక్యాల్ని ఉచ్చరించినా, వాళ్ళలో కొందరు అంతరాంతరాల్లో రాములమ్మ ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయారు.

అంతిమ యాత్ర తంతులన్నీ ముగిసిన తర్వాత, పక్కనే పది కిలోమీటర్ల దూరంలో ఉన్న తన గ్రామానికి పోయిన రాములమ్మ ఆడపడుచు వసంతలక్ష్మి, ఈ గాలి వార్త విని, వీలు చూసుకొని ఇరవయ్యో రోజుకల్లా రోషావేశాలతో తిరిగి వచ్చింది. మరదలు రాములమ్మను కాస్త హద్దుమీరి అతిగానే మందలించింది. అయితే రాములమ్మ తగ్గుస్వరంతోనే తిరగబడింది.

"నేను కాని కూడు తిన్నా, కట్టుకొన్నవాడు గిట్టినాకే తిన్నాను. మరి నువ్వో? మొగుడుండగానే వ్యవహారం నడిపేస్తున్న నెఱజాణవి!"

వసంతలక్ష్మి ఖంగుతిన్న స్వరంతో అంది - "నీ నోట్లో బుగ్గడ, ఎవరు చెప్పారే నీకీ మాటలు?"

"చచ్చి స్వర్గానో, నరకానో ఉన్న నీ తమ్ముడే చెప్పాడు!" రాములమ్మ సన్నగా అంది.

"చచ్చేవరకూ వాడూ, యింతకాలమూ నువ్వూ ఎందుకు నోరు మూసుక్కూర్చున్నట్టు?" వసంతలక్ష్మి ఉడుకుమోతుతనంగా అడిగింది.

"ఆ నోటా ఈ నోటా విన్నమాటైతే అడిగుండేవాడే! ఓసారి మీ ఊరొచ్చిన మీ తమ్ముడు మీ ఇంట్లో అడుగు పెట్టేసరికి, చావిడి గదిలో గుర్రుపెట్టి నిద్రబోతున్న మీ ఆయన కన్పించాడు. లోపల నువ్వేదో పన్లో ఉన్నావేమోనని నేరుగా వెనక దొడ్లోకి వెళ్ళేసరికి, గొడ్లపాకలో నువ్వెవరితోటో కులుకుతున్నావని గ్రహించి, చడీ చప్పుడు చెయ్యకుండా తిరిగి వచ్చేశాడు. కడుపుగ్గపెట్టుకోలేక ఓసారి ఈ రహస్యం నాతో చెప్పేశాడు. 'ఇద్దర్నీ నిలేసి ఉప్పుపాతర వేసెయ్యలేకపోయావా', అని ఏదో ఆవేశంలో అనేశాను. దానికి మీ తమ్ముడేం అన్నాడో తెలుసా?

"ఇటు అడిగినంత కట్నమిచ్చుకోలేక, అటు ఓ మూడో పెళ్ళి ముసలాడు డబ్బాశ చూపించడంతో, అమ్మా, నాన్నలు దాని గొంతుక కోసేశారు. నాదా, తెలిసీ తెలియనీ, ఎదిరించ లేని చిన్నవయసు. నా అప్ప, దాని సుఖం అది చూసుకొంటోంది. దీన్ని గురించి నువ్వూ రభస చేయ్యక మౌనంగా ఉండిపో' అని.

"ఆ తర్వాత ఎన్నోసార్లు మీరు మా ఇంటి కొచ్చారు. మేం మీ ఇంటి కొచ్చాం. ఆ మాట గురించి ఊసెత్తానా? కనుబొమలెగరవేశానా? ఇప్పుడేమో నువ్వు పనికట్టుకొని వచ్చి నీతి

పాఠాలు వల్లించావు!" అంది రాములమ్మ వసంతలక్ష్మిని ఓరకంటితో చూస్తూ.

వసంతలక్ష్మి కాస్సేపు మౌనంగా ఉండిపోయింది. ఇలా ఎదురు దెబ్బ తగుల్తుందని ఊహించలేకపోయింది. ఆ తర్వాత మాటా మాటా కూడదీసుకొని కాస్త ప్రయత్నంతో అంది.

"అమ్మా, నాన్నలు చేసిన అన్యాయాన్ని తమ్ముడూ, ఆడదాని మనసుని నువ్వూ అర్థంచేసుకొన్నారు. ఈ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను."

"మరైతే ఎందుకొచ్చి నన్ను నిలదీసావొదినా?" - రాములమ్మ నెమ్మదిగానే ప్రశ్నించింది.

"నా సంగతి మీ ఇద్దరికీ తెలిసి పోయిందని నాకేం తెలుసు? తమ్ముడు పోయిన వాసన్లింకా పోకముందే, మరోవ్యక్తి చందనగంధాలంటించు కొన్నావని తెలిసి, అక్కగా ఆవేశం అణుచుకోలేకపోయాను. నైతికంగా నీకు నీతులు చెప్పే అధికారం నేను కోల్పోయినా, ఓ సమాజపరమైన భయంతో వచ్చి నిన్ను మందలించాను. మరదల్ని మందలించిందని జనాలనుకొంటే నా బాధ్యత తీరినట్లేగా? ఇంతకన్న తిన్నగా నీ ప్రశ్నకేం సమాధానం చెప్పగలనని" వసంతలక్ష్మి భారంగా అంది.

"సరే, నీ మొగుడు ముసలివాడూ, తాగుబోతూ అని నేనూ, నీ తమ్ముడూ నీ వ్యవహారం గురించి నోరెత్తలేదు. ఆ వ్యక్తి ఎవరోనని ఆరా తీయడానికి కూడా నా మొగుడిష్టపడలేదు. ఇంతకీ, నీ తమ్ముడు పోయిన తర్వాత ఇంత త్వరలోనే పక్కింటి పెద్దమనిషి వలలో ఎందుకు పడ్డావన్న కారణం నువ్వడగనేలేదు!"

"అడుగుదామనే అనుకొన్నాను, కానీ నన్నంత వరకూ రానీయకుండా నా గొంతు నొక్కేశావు!"

రాములమ్మ పట్టె మంచం కిందనున్న రేకు పెట్టె పైకిలాగి, అందులోంచి కొన్ని కాయితాలు తీసి వసంతలక్ష్మికి చూపించింది.

"ఇవి ఈ ఇంటినీ, ఉన్న అరెకరం మామిడితోటనీ మీ తమ్ముడు మీ అమ్మా నాన్నల వైద్యం కోసం సుందర్రావు దగ్గర తీసుకొన్న ఋణానికి తాకట్టు పెట్టినట్టి పత్రాల నకళ్లు. 'ఇల్లూ, తోటా వదలుకొంటావో, లేదా నాకు సుఖాన్నందిస్తావో?' అని బెదిరించాడు. నా పుట్టింటికి వెళ్ళినా పట్టెడన్నం పెట్టలేని పరిస్థితి వాళ్లది. ఆ సంగతి నీకూ తెలుసు. తనకీ పెళ్ళాం, బిడ్డలూ, నాకు మొగుడు పిల్లలూ లేరని చాలా ఆలోచించి, రోడ్డు మీద నిరాశ్రయంగా బతికే ధైర్యంలేక పరిస్థితులకి తల వంచక తప్పలేదు. అంతేకాని ఒళ్ళు కొవ్వెక్కి ఇంత నీచానికి ఒడికట్టలేదు.

"బరి తెగించిన సుందర్రావు అజాగ్రత్త అను, లేదా నా దురదృష్టమను, సంగతి తెలిసి గ్రామంలో గాలిదుమారం రేగింది. అయిందేదో అయింది. తాళి కట్టమన్నాను. అలాగే ఆలోచిస్తానన్నాడు. మొదటి ఉడుకు కాస్త తగ్గింది కాబట్టి వెనకడుగేవేస్తాడో, ముందుకొచ్చి తాళి కడ్తాడో తెలియదు," అంటూ వదినెను కౌగిలించుకొని బావురుమంది.

"ఆపాటి మాటనడం నయమే కదా? నేను మాట్లాడి ఒప్పిస్తాను. నువ్వు బెంగెట్టుకోక. ఇప్పుడింట్లోనే ఉంటాడనుకొంటాను?" వసంతక్ష్మి అంది.

"తను హైదరాబాద్ పోయాడు. ఈ రాత్రికి వస్తాడు," అంది రాములమ్మ.

ఎవరో తలుపు తట్టిన చప్పుడు విని, వసంతలక్ష్మి వెళ్ళి తలుపు తీసింది. లక్ష్మి రైసుమిల్లు యజమాని మూడో కొడుకు ముత్యాల్రావు ఎదురుగా వున్నాడు.

"ఆ సుందర్రావుగాడు హైదరాబాద్ వెళ్ళాడని తెలిసి నేనొస్తే, నువ్వు నీ మొగుణ్ణి వదిలొచ్చి మరదలకి కాపలా ఉన్నావా?!" అని ముద్ద ముద్దగా మందు డోసులో అన్నాడు.

"మొగుడు చచ్చి నా మరదలేడుస్తోంటే, మీ కిదేం పోయ్యేకాలంరా? ఆ సుందర్రావుగాడేం వాగాడో తెలియదుకాని, వాడి మాటలు పట్టుకొని మీరూ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారన్నమాట?! నువ్వు కూడా చెరువుగట్టు దగ్గరికిపోయి, నీకూ నా మరదలకీ జత కుదిరిందని చెప్పి మరో ఇంతమందిని పంపు దొంగనాయాలా!" – వసంతలక్ష్మి నోరు చేసుకొని గట్టిగా అరిచింది.

ఇంటి ఆవరణ బయట, రోడ్డు మీద నిద్రగన్నేరు చెట్టు కింద పోగయిన కుర్రకారు వసంతలక్ష్మి కేకలు విని ముసిముసిగా నవ్వుకోసాగారు.

"అయినా, ఆ సుందర్రావుగాణ్ణి తిరిగొచ్చిన తర్వాత నలుగురిలోనూ పంచాయితీ పెట్టి, భరతం పట్టకపోతే నా పేరే వసంతలక్ష్మి కాదు!" అంటూ చూరులో ఉన్న చీపురందుకొని ముత్యాల్రావుని రెండుమార్లు గట్టిగా బాదింది.

అనుకోని ఈ పరిణామానికి వాడు బెదిరిపోయి రోడ్డు మీదకు పరుగెత్తాడు. వీధిలోకి వచ్చిన వసంతలక్ష్మిని చూసి అక్కడున్న కుర్రకారు జారుకొన్నారు.

ఆ సాయంత్రం బస్సు దిగి మునిమాపువేళ ఇల్లు జేరిన సుందర్రావు తన ఇంటి అరుగు మీద కూర్చున్న వసంతలక్ష్మిని చూసి విస్తుపోయాడు. ఏదో అనబోయి ఆ ప్రయత్నం మానుకొని, గుమ్మానికి వేసిన తాళం తీసి లోపలికి వెళ్ళాడు. వసంతలక్ష్మి కూడా లోపలికి అడుగు పెట్టింది.

పావుగంట దాటేసరికి తాకట్టు పత్రాల్ని తీసుకొచ్చి రాములమ్మ చేతికందించింది. ఆశ్చర్యపోతూ వసంతలక్ష్మి కళ్ళలోకి చూసింది రాములమ్మ.

"అయినకాటికి నీ దౌర్జన్యం ఉపయోగించి, బెదిరించి, నా మరదలి మర్యాదను మంటగలిపావు. ఓసారి సంఘంలో నవ్వులపాలైన తర్వాత ఇక ఉండే గౌరవమూ, పోయే పరువంటూ ఏమీ లేవు. పంచాయితీ పెట్టి రచ్చకీడుస్తాను. కాదంటావూ దాని మెళ్ళో పసుపుతాడు కట్టు అన్నాను. కాదన్నాడు. ఆ పక్షంలో కనీసం అప్పు రద్దుచేసి, తాకట్టు పత్రాలివ్వమన్నాను. ఏమనుకొన్నాడో, ఏ కళనున్నాడో బీరువాలోంచి తాకట్టు పత్రాలు తీసి యిచ్చేశాడు. ఇస్తూ ఓ మాటన్నాడు. ఇల్లూ, తోటా వదిలేసినందుకు నువ్వు కృతజ్ఞతగా ఉండాలన్నాడు. సుందర్రావు మళ్ళీ మళ్ళీ నీ దేహాన్ని దోచుకొని ఋణం వసూలు చేసుకొనే యిదిలో ఉన్నాడు.

"నేను చేయగలిగింది చేశాను. ఇకపై సుందర్రావుతో ఎలా వ్యవహరిస్తావో నీ ఇష్టాఇష్టాలపై ఆధారపడి వుంటుంది. వీలైతే వేలు చుట్టూ చుట్టుకొని అతగాణ్ణి ఓ ఆట ఆడించే వయసు నీలో ఉంది. మాటకీ, చేతకీ మారు మనువుతో ముడిపెట్టు. వాడితో మనువు సాధ్యంకాకపోయిన

పక్షంలో కూడా, నీ తనువు కూడా స్వాధీనం తప్పే అవకాశం లేకపోలేదు. ఏది ఏమైనా కడుపులో నలుసు పడకుండా చూసుకో! ఎందుకైనా మంచిది. తాకట్టు పత్రాల్ని చింపిపారేద్దాం" అంది వసంతలక్ష్మి.

తాకట్టు పత్రాల అసలునీ, నకలునీ వంటపొయ్యిలో కట్టెల్ని అంటించడానికి ఉపయోగించి, రాజుకొన్న కట్టెల్ని విసరసాగింది రాములమ్మ. వసంతలక్ష్మి ముక్కు సూటిగా తిరకాసు లేకుండా ఇచ్చిన సలహాని గురించి ఆలోచించసాగింది.

ఆ మర్నాడు సుందర్రావు కోసం వచ్చిన పొంతారం రైసుమిల్లు ఓనరు తలుపులు తీసి ఉండడం చూసి, "సుందర్రావూ," అంటూ లోపలికి అడుగు పెట్టాడు. పక్కగదిలోంచి హాల్లోకి ప్రవహించి గడ్డ కట్టిన రక్తపు ధారల్ని చూసి కేకలు వేశాడు.

ముందస్తుగా వారి మాటా, వీరి మాటా విన్న పోలీసులు లక్ష్మీరైసుమిల్లు యజమాని మూడో కొడుకు ముత్యాల్రావునీ, పొంతారం రైసుమిల్లు ఓనరునీ, రాములమ్మనీ, వసంతలక్ష్మినీ రచ్చకీడ్చేశారు. రాములమ్మ కోసం పోటీపడ్డ వాళ్ళలో ఎవరో సుందర్రావుని చంపేసి ఉంటారన్న జనవాక్కు ఆ ఆడంగుల్నిద్దర్నీ రక్షించింది. హెడ్ కానిస్టేబుల్ వీరాసామి ఈ విషయంలో వాళ్ళిద్దరికీ కాస్త లౌక్యంగా అండ నిలిచాడు.

అయితే ఆ క్రితం రోజు అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా లేచి వెళ్ళిన వదిన వసంతలక్ష్మిని రాములమ్మ మూసిన కనురెప్పల మధ్య నుంచి, తగ్గించిన కోడిగుడ్డు దీపం క్రీనీడల్లో చూసింది. తెల్లవారుతోనే ఉడుకు నీళ్ళ కోసం పెరట్లో ఉన్న ఇటికల పొయ్యిలో పెట్టిన మంటలో, తాటి మట్టలతోపాటు పచ్చడి బండ కూడా కాలి మసి కావడం చూసింది. రాములమ్మ నోరు మెదపలేదు. తనని దౌర్జన్యంగా అనుభవించిన సుందర్రావుకి వదిన వసంతలక్ష్మి తగిన శాస్తి చేసిందని అనుకొంది.

ఎన్ని సార్లో నిద్రసుఖాన్నందించిన సుందర్రావుకి ఆ రాత్రి అంతిమ సుఖాన్నందించి, అతను ఏమరుపాటుగా ఉన్నప్పుడు అంతిమ యాత్రకి పంపిన వసంతలక్ష్మి కసిగా మనసులో అనుకొంది.

'ఇద్దరితో, అందులోనూ అయిన వాళ్ళిద్దరితో వ్యవహారం నడపాలని చూశాడు! తగిన శిక్ష విధించాను!'

ముత్యాల్రావూ, మిల్లు ఓనరూ లాయర్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇద్దరిలోనూ ఎవరికి గేలం వెయ్యాలా లేక ఇద్దరికీ వెయ్యాలా అని హెడ్ కానిస్టేబుల్ వీరాసామి ఈ గ్రామంలో రాములమ్మ ఇంటికీ, ఆ గ్రామంలో వసంతలక్ష్మి ఇంటికీ చక్కర్లు కొట్టడం మొదలు పెట్టాడు. అయితే రాములమ్మ మీద వీరాసామి నీడొక్కటే కాదు, సమాజంలోని చాలమంది పెద్దమనుషుల మనసుల నీడలు పడసాగాయి.

స్త్రీ, పురుష సంబంధమైన నాణేనికి వివాహం బొమ్మ. వివాహేతర సంబంధాలు బొరుసు. బొరుసు పడ్డప్పుడల్లా అదో లింకు పురాణానికి నాంది. లింకు పురాణాలు వినడానికి ఎందరో కుతూహలం చూపించినా, వాటిలో దిగడానికి కొందరే సాహసిస్తారు. ✿